నాటిన మొక్కను సంరక్షిస్తేనే ఫలితం



కుషాయిగూడ ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. కుషాయిగూడ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన మనబడి కార్యక్రమానికి ఆయన హాజరై విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం బీఎల్ఆర్ మాట్లాడుతూ సామాజిక స్పృహతో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించుకున్నప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయన్నారు. అలాగే ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాల్సిన అవశ్యకత ఉందన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలంటే మొక్కలు నాటడం తప్పనిసరన్నారు. ఆ దిశగా విద్యార్థులు ప్రజల్లో అవగాహన కల్పిస్తూ చైతన్యం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాపురెడ్డి, సిబ్బంది. స్థానిక నేతలు నేమూరి మహేష్‌గౌడ్, నారెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, గుమ్మడి జంపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తాం



కమిషనర్‌కు సమస్యలను వివరిస్తున్న డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 4, 5 డివిజన్లలో డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్, కమిషనర్‌తో కలిసి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా వార్డుల్లో నెలకొన్న రోడ్లు, డ్రైనేజ్ సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకుని కమిషనర్‌కు వివరించారు. అనంతరం డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ.. త్వరలోనే వార్డుల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు యాసారం మహేష్, బొడిగె కృష్ణగౌడ్, కో ఆప్షన్ మెంబర్ చిలుముల జగదీశ్వర్ రెడ్డి, మున్సిపల్ ఏఈ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ సేవలు అభినందనీయం



బీపీసీఎల్ కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, లయన్స్ ప్రతినిధులు

కుషాయిగూడ: సేవాభావనతో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేపడుతున్న లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని భారత్ పెట్రోలియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా చర్లపల్లి యూనిట్ ఇన్‌చార్జి ఎం.సూర్య నాయక్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కాప్రా, ఏఎస్ రావునగర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం చర్లపల్లిలోని బీపీసీఎల్ ప్లాంట్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ప్లానెట్ ఆప్టికల్స్, పద్మసాయి డెంటల్ ఆస్పత్రి, సన్‌సీడ్ ఆస్పత్రుల వైద్యులు కార్మికులకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మెరుగైన వైద్యం, కంటి ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించి వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారు. శిబిరంలో డాక్టర్ దినేష్ నమిలే, డాక్టర్ కాత్యాయిని, డాక్టర్ చాముండేశ్వరీ, డాక్టర్ అన్వేష్, అనిల్, సునీల్ వైద్య పరీక్షలు నిర్వహించగా లయన్స్ ప్రతినిధులు కంతేటి విజయ్‌కుమార్, వరప్రసాద్, మాకవరం శ్రీదేవి, రోజీ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి



డీసీకి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మల్కాజిగిరి: మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ కార్పొరేటర్ శ్రవణ్‌తో పాటు బీజేపీ నాయకులు డీసీకి వినతిపత్రం అందజేశారు. శ్రవణ్, అసెంబ్లీ కన్వీనర్ డీఎస్ వెంకటేష్ మాట్లాడుతూ ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లు దెబ్బతిన్నాయని, మరమ్మతులు చేపట్టాలని కోరామన్నారు. ప్రజాపాలనలో ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీతో పాటు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని, చాలా మందికి సబ్సిడీ రావడం లేదని, జీహెచ్ఎంసీ విభాగం ఆధ్వర్యంలో కౌంటర్లు ఏర్పాటు చేసి సమాచారాన్ని తెలియజేయాలన్నారు. వర్షాకాలం సందర్భంగా మాన్‌సూన్ టీంలతో పాటు ఎంటమాలజీ విభాగాన్ని అప్రమత్తం చేసి అందుబాటులో ఉంచాలన్నారు. సర్దార్ పటేల్ నగర్‌లోని శ్మశానవాటికలో మరమ్మతులు చేపట్టాలని, అద్దె భవనంలో కొనసాగుతున్న ప్రభుత్వ లైబ్రరీని చౌరస్తాలోని ఇందిరాభవన్‌కు మార్చాలని కోరామన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు రామక్రిష్ణ, నాగరాజు, ధన్‌రాజ్, లక్ష్మణ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించండి

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. వెంకటాపురం డివిజన్ రాజీవ్‌గాంధీనగర్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన స్థానిక కార్పొరేటర్ సబిత కిషోర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక బస్తీవాసులు తాగునీరు, త్రీ ఫేజ్ కరెంట్ సమస్యలను పరిష్కరించాలని, వంగిపోయిన విద్యుత్ స్తంభాలు మార్చి కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. పెన్షన్, రేషన్ కార్డు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇప్పించాలని బస్తీవాసులు ఎమ్మెల్యేను కోరారు. సానుకూలంగా స్పందించిన ఆయన సంబంధిత అధికారులకు వెంటనే తెలియజేశారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రావు, బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ మోసీన్, సురేష్, పాచయ్య, తాజుద్దీన్, ఫరీద్, స్థానిక బస్తీవాసులు తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో వెంటనే స్పందించండి

అధికారులకు కార్పొరేటర్ శ్రీవాణి ఆదేశం



అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

రామంతాపూర్: వార్డు కార్యాలయంలో మంగళవారం కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్ రజనీకాంత్ రెడ్డి, మేనేజర్ పల్లె రవీందర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేందర్‌తో వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండి వరదలు వచ్చినప్పుడు సిబ్బంది వెంటనే స్పందించి సంఘటన స్థలాల చేరుకోవాలన్నారు. అదే విధంగా మ్యాన్‌హోళ్లపై మూతల పరిస్థితిని సమీక్షించి మూతలు లేనిప్రాంతంలో కొత్తగా సేఫ్టీ గ్రిల్స్ వేయాలని సూచించారు. అన్ని విభాగాల అధికారులు ప్రజలకు అందుబాటులో లేకపోతే ఉన్నతాధికారులకు సమాచారం అందించి కఠిన చర్యలు తీసుకునే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి



తారకరామనగర్ కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ రాజ్యలక్ష్మీ

మౌలాలి: వినాయకనగర్ డివిజన్ పరిధిలోని తారకరామనగర్ కాలనీలో మంగళవారం కార్పొరేటర్ రాజ్యలక్ష్మీ పర్యటించారు. డ్రైనేజీ సమస్య ఉందని కార్పొరేటర్‌తో స్థానికులు మొర పెట్టుకున్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని జలమండలి మేనేజర్ నవీన్ ఆదేశించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ఓంప్రకాష్, జిల్లా అధికార ప్రతినిధి నవీన్, సాయి, సురేష్, శ్రీకాంత్, మహేష్ కాలనీవాసులు గంగాధర్, నాగార్జున, నరసమ్మ ఉన్నారు.

పాలిటెక్నిక్ కోర్సులతో..

ఉద్యోగం, ఉపాధికి భరోసా..

ఈనెల 20 నుంచి పాలిటెక్నిక్ కోర్సులకు కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభం



కౌన్సిలింగ్‌లో విద్యార్థులు(ఫైల్)



వినయ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్

రామంతాపూర్: పదో తరగతి పాస్ అవ్వగానే తక్కువ సమయంలోనే ఉద్యోగం, ఉపాధి పొందాలనుకునే వారికి అతి తక్కువ అందుబాటులో ఉన్న మార్గం పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు ఈ నెల 20 నుంచి పాలీసెట్ ఎంట్రన్స్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు కౌన్సింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది.

ఈ సందర్భంగా పురస్కరించుకుని పాలిటెక్నిక్ కోర్సులపై కౌన్సిలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వినయ్‌కుమార్‌తో సాక్షి ఇంటర్వ్యూ వివరాలు..

సాక్షి: పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు పూర్తి చేసిన విద్యార్థుల భవిష్యత్ ఎలా ఉంటుంది?

ప్రిన్సిపాల్: పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా ఇస్తున్నాయి. స్వల్ప వ్యవధిలోనే కోర్సులు పూర్తి చేసుకుని ఉద్యోగాలు, ఉపాధి పొందే అవకాశాలు మెండుగా ఉన్నాయి. చిన్న వయసులోనే ఉద్యోగం, ఉన్నత విద్యను అభ్యసించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ల కంటే కూడా పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తి చేసిన వారికి వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ కార్పొరేట్ బహుళ జాతి సంస్థలు ఉద్యోగాలు ఇవ్వడానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఎందుకంటే ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లు తరచూ కంపెనీలు మారుతుంటారు. అదే పాలిటెక్నిక్ అభ్యర్థులను నియమించుకుంటే నిలకడగా పనిచేస్తారనే ఉద్దేశంతో పాలిటెక్నిక్ విద్యార్థులకు ఉద్యోగాలు ఇస్తున్నారు.

సాక్షి: పాలిటెక్నిక్ కోర్సుల్లో టెక్నికల్ కోర్సులే కాకుండా నాన్ టెక్నికల్ కోర్సులు కూడా ఉన్నాయా?

ప్రిన్సిపాల్: పాలిటెక్నిక్ కోర్సుల్లో ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించే టెక్నికల్ పోస్టులతో పాటు అగ్రికల్చరల్ హార్టికల్చరల్ వెటర్నరీ వంటి నాన్ టెక్నికల్ కోర్సులు కూడా ఉన్నాయి.

సాక్షి: పాలిటెక్నిక్‌లో నచ్చిన కోర్సును ఏ విధంగా పొందాలి?

ప్రిన్సిపాల్: కోర్సుల ప్రవేశానికి ఇటీవల నిర్వహించిన ప్రవేశ పరీక్షల్లో మంచి ర్యాంకు సాధిస్తే అనుకున్న చోట తమకు నచ్చిన కోర్సులు ఎంపిక చేసుకోవచ్చు.

సాక్షి: పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించవచ్చా?

ప్రిన్సిపాల్: ఈ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు ఈసెట్ పరీక్ష రాసి లిటరల్ ఎంట్రీ ద్వారా నేరుగా బీటెక్ బీఈ కోర్సుల్లో రెండవ సంవత్సరంలో చేరవచ్చు. అదేవిధంగా ఎంసెట్ ఐఐటీ జేఈఈ తదితర పోటీ పరీక్షలు కూడా రాయవచ్చు.

సాక్షి: పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల వ్యవధి ఎంత ఉంటుంది?

ప్రిన్సిపాల్: టెక్నికల్ డిప్లొమా కోర్సుల వ్యవధి మూడు నుంచి మూడున్నర ఏళ్లు. నాన్ టెక్నికల్ కోర్సులైన అగ్రికల్చర్ వెటర్నరీ హార్టికల్చర్ సెరికల్చర్ వంటి కోర్సులు రెండు సంవత్సరాల నుంచి మూడు సంవత్సరాల కాల వ్యవధి ఉంటుంది.

సాక్షి: రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏ డిప్లొమా కోర్సులు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి.

ప్రిన్సిపాల్: రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్, మెకానికల్, మెటలర్జికల్, కెమికల్, ప్యాకేజింగ్ డిప్లొమా కోర్సులు ఉన్నాయి.

సాక్షి: ఇటీవల నిర్వహించిన పాలీసెట్ ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు కౌన్సిలింగ్ ప్రక్రియ ఎప్పుడు ప్రారంభమవుతుంది?

ప్రిన్సిపాల్: ఈ నెల 20 నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియలో 22 నుంచి 25 వరకు ధ్రువపత్రాల పరిశీలన, 22 నుంచి 27 వరకు వెబ్ ఆప్షన్‌లో 29, 30వ తేదీల్లో సీట్లు అలాట్మెంట్ ఉంటాయి.

20న మల్లన్న ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

గౌతంనగర్: మల్లికార్జునగర్ మల్లన్న ఆలయ 27వ వార్షిక బ్రహ్మోత్సవాలు 20వ తేదీన ప్రారంభం కానున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం నుంచి ధ్వజారోహణ, రుద్రాభిషేకం, మండపారాధన, గణపతి, రుద్ర హోమంతో పాటు సీతారామచంద్రుల కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం అన్నదానం ఉంటుందన్నారు.

మెట్రో సంస్థలో స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలి

– ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



ఉప్పల్: బేగంపేటలోని మెట్రో కార్యాలయంలో ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డిని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మంగళవారం కలిసి స్థానిక సమస్యలపై చర్చించారు. ప్రతిష్ఠాత్మకమైన మెట్రో సంస్థలో అర్హులైన స్థానిక యువతకు 30 శాతం ఉద్యోగావకాశాలు కల్పించాలని వినతి పత్రాన్ని అందజేశారు. అందుకు స్పందించిన ఆయన తప్పకుండా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బన్నాల ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

నీటి సరఫరాలో సమస్యలకు త్వరలో పరిష్కారం



పైపులైన్ మరమ్మతులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: ఓల్డ్ మల్కాజిగిరి ప్రాంతంలో నీరు సరఫరాలో సమస్యను పరిష్కరిస్తామని కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు తాగునీరు తగిన ప్రెషర్‌తో రావడం లేదని, బోరు అందుబాటులో లేదని ఆయన దృష్టికి తీసుకొని వచ్చారు. నీటి ప్రెషర్ పెంచడానికి నూతన జంక్షన్లు, పైపులైన్స్ వేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించామన్నారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు నవీన్, ప్రణయ్‌తో పాటు తేజ, ప్రేమ్, శ్రీధర్ పాల్గొన్నారు.

ఉప్పల్‌కు గతంలో ఎన్నడూ లేనంతగా నిధులు



చక్రిపురం చౌరస్తాలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి పెద్దఎత్తున నిధులు మంజూరు చేయడం పట్ల చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి హర్షం వ్యక్తం చేశారు. చక్రిపురం చౌరస్తాలో సీఎం చిత్రపటానికి మంగళవారం పాలాభిషేకం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఉప్పల్‌కు రూ.101.52 కోట్ల నిధులు మంజూరు చేయడం సంతోషకరమన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉప్పల్‌కు అత్యధిక నిధులు కేటాయించడంపై ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధుల్లో రూ.37.07 కోట్ల నిధులతో చర్లపల్లి డివిజన్‌లోని ఈసీనగర్ నుంచి రాంపల్లి చెరువు వరకు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం పనులు చేపట్టనున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో కాసుల పోచయ్యగౌడ్, గోపాల్‌యాదవ్, నాగిళ్ల బాల్‌రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, నవనీత, నీరజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో ఇబ్బందులు తొలగిస్తాం



డ్రైనేజీని పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

మల్కాజిగిరి: డివిజన్ పరిధిలోని కాలనీల్లో వర్షాకాలంలో ఇబ్బందులు లేకుండా చూస్తామని ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. సత్తిరెడ్డినగర్ కాలనీలో ఇంజినీరింగ్ విభాగం అధికారులతో కలిసి మంగళవారం ఆయన పర్యటించారు. చిన్నపాటి వర్షానికే నాలాలు నిండి డ్రైనేజీ రోడ్ల మీద నిల్వడంతో పాటు ఇళ్లలోకి చేరుతోందని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఇప్పటికే నాలాల్లో పూడిక తీసే పనులు పూర్తవుతున్నాయని, ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించామని కార్పొరేటర్ తెలిపారు. డీఈ లౌక్య, ఏఈ శ్రీకాంత్, విఐ రజనీకాంత్ కాలనీవాసులు పాల్గొన్నారు.

రజకులకు కేటాయించిన స్థలాన్ని పరిరక్షించాలి



వివరాలు వెల్లడిస్తున్న రజక సంఘం ప్రతినిధులు

గౌతంనగర్: రజకులకు కేటాయించిన స్థలాన్ని కబ్జాదారుల నుంచి సంరక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ రజక సంక్షేమ సంఘం ప్రతినిధులు కోరారు. సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగేష్ మాట్లాడుతూ మల్కాజిగిరి మండల రెవెన్యూ సరిహద్దులోని అన్నపూర్ణ సొసైటీ కాలనీ ఆనుకొని ఉన్న సర్వే నంబర్ 844/1లో ప్రభుత్వ స్థలంలో 50 ఏళ్లుగా దోబీఘాట్ ఉండేదని, తాతలు, తండ్రులు, తాము ఈ స్థలంలో బట్టలు ఉతికి జీవనం సాగించామన్నారు. పోరాటంతో సమారు 30 గుంటల స్థలాన్ని తెలంగాణ రజక సంక్షేమ సంఘానికి కేటాయించి అందులో కమ్యూనిటీ హాల్ సైతం నిర్మించారని తెలిపారు. ఇందులో ఇటీవల కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ప్రహరీ ఏర్పాటు చేయడాన్ని గమనించి మల్కాజిగిరి మండల అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ వినతిపై స్పందించిన మండల తహసీల్దార్ సీతారం ఆదేశాల మేరకు ఆర్ఐ.శ్రీశైలం ఆధ్వర్యంలో అక్కడ వెలిసిన నిర్మాణాలను మంగళవారం తొలగించినట్లు చెప్పారు. ఈ స్థలాన్ని సంరక్షించి రజకుల సంక్షేమానికి ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రజక సంఘం ప్రతినిధులు సత్యనారాయణ, కిరణ్, శంకర్, కృష్ణ, ప్రవీణ్‌కుమార్, రవి, యాదగిరి, భాస్కర్, భూపాల్, మహేష్, శశికుమార్, ప్రకాష్‌తో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు కన్నెమళ్ల నాగరాజు తదితరులు ఉన్నారు.

గొప్ప ఆలోచనలతో ముందుకెళ్తే లక్ష్యం సులువు



చదువుతున్న విద్యార్థి

బోడుప్పల్: విద్య పట్ల పిల్లలకు ప్రత్యేక అవగాహన కల్పించాలని లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్ లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం నేషనల్ రీడింగ్ డే వేడుకలు నిర్వహించి విద్యార్థులచే తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో చదివించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎలా చదవాలి, ఏ విధంగా అక్షరాలను గుర్తించాలో వివరించారు. ఏ భాషలోనైనా ఉచ్ఛరణను బట్టి అక్షరాలను సులభమైన పద్ధతిలో చదవడం నేర్చుకోవాలన్నారు. విద్యార్థులు గొప్ప ఆలోచనలతో ముందుకెళ్తూ తాము ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు తమ వంతు కృషి చేయాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి



ప్రత్యేక అలంకరణలో..

బోడుప్పల్: భక్తుల కోరికలు తీర్చే కల్పవల్లిగా శ్రీమాతా నిమిషాంబదేవి అమ్మవారు పేరొందారని ఆలయ చైర్మన్ కామరౌతు వినోద్‌కుమార్ అన్నారు. పెంటారెడ్డి కాలనీలోని శ్రీమాతా నిమిషాంబదేవి అష్టాదశ 18వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో పాల్గొని ఆయన మాట్లాడారు. గణపతి పూజ, పుణ్యాహవాచనం, ప్రాతకాల మండప పూజ, ఆవాహిత దేవత హోమం, బలి ప్రదానం, పూర్ణాహుతి, కలశ ఉద్వాసన కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే అమ్మవారికి పంచామృత, 56 రకాల పండ్ల రసాలతో, సుగంధ ద్రవ్యాలతో నిజాభిషేకం, విశేష అలంకరణ, అమ్మవారికి పల్లకీ సేవ ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రతినిధులు అశోక్‌కుమార్, శ్రీనివాస్, రమేష్ కొరిచర్ల శ్రీనివాస్‌రావు, ఆలయ ప్రధాన అర్చకులు చంద్రశేఖర్‌శర్మ భక్తులు పాల్గొన్నారు.

న్యూ మారుతీనగర్‌ను అభివృద్ధి చేస్తా



న్యూమారుతీనగర్ కమిటీతో కార్పొరేటర్ సునీతా యాదవ్

మౌలాలి: న్యూమారుతీనగర్ కాలనీ అభివృద్ధికి తనవంతు పాటుపడతానని మౌలాలి డివిజన్ కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్ అన్నారు. న్యూమారుతీనగర్ కాలనీ నూతన కార్యవర్గ సభ్యులను మంగళవారం కార్పొరేటర్ సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కాలనీలోని సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు దర్శిరెడ్డి తదితరులు ఉన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

అల్వాల్: అల్వాల్ హిల్స్‌లో వెలసిన శ్రీపద్మావతి గోదా సమేత శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవాలయ షష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం మంత్ర హోమం, మన్యుసూక్త హోమాలను వేద మంత్రోచ్ఛరణాల మధ్య వైభవంగా నిర్వహించారు. సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణం, ద్వారతోరణ ధ్వజకుంభారాధన, మూలమంత్ర హోమం, పూర్ణాహుతి, ఆరగింపు, బలిహరణం, తీర్థ ప్రసాద గోష్టి పూజలను నిర్వహించినట్లు ట్రస్టు సభ్యులు తెలిపారు.

కేంద్ర మంత్రులకు ఘన స్వాగతం పలకాలి



మాట్లాడుతున్న మల్లారెడ్డి

మల్లాపూర్: కేంద్ర మంత్రులుగా బాధ్యతలు స్వీకరించి నగరానికి వస్తున్న బొగ్గు గనుల శాఖామంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కి పెద్ద ఎత్తున స్వాగతం పలకాలని బీజేపీ శ్రేణులకు మేడ్చల్ జిల్లా అర్బన్ జిల్లా కన్వీనర్ మల్లారెడ్డి పిలుపునిచ్చారు. ఉప్పల్ నియోజకవర్గ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ దేవసాని బాలచందర్ అధ్యక్షతన మల్లాపూర్ ఎస్ఎల్ఎన్ఎస్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా కన్వీనర్ మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి హాజరయ్యారు. ఈ నెల 20న మంత్రులు నగరానికి వస్తున్న సందర్భంగా బేగంపేట విమానాశ్రయం నుంచి నాంపల్లి బీజేపీ కార్యాలయం వరకు స్వాగతం పలకాలన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పద్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు హనుమంత్‌రావు, జిల్లా కార్యదర్శి అంబటి వెంకటచలం, జిల్లా అధికార ప్రతినిధులు గోపాల్‌గౌడ్, రాంప్రదీప్, జనార్దన్ రెడ్డి, 10 డివిజన్ల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.